# శ్రమైక జీవన...

-సింగమనేని నారాయణ

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు.

పట్టణ వీథుల్లో సంచారం మాత్రం అప్పటికే ప్రారంభమైంది. పాలవాళ్ళూ, పేపర్ వాళ్లూ, బస్సులు దిగి ఆటోల్లో వచ్చే వాళ్లూ, ప్రయాణాలు ప్రారంభించే వాళ్లూ, వీళ్ళుగాక హడావుడిగా పరుగులు తీసే అనవసరం మనుషులూ, వీళ్ళతో తెల్లారినట్టే వుంది.

ఆ పట్టణం చివర, అభివృద్ధి చెందుతూన్న ఒక అందమైన కాలనీలో, రెండు పోర్షన్లు గల కాంపౌండ్ ముందు, ఆ సమయంలో ఆటో ఆగింది. ఆ వీధిలో కొన్ని ఇళ్ళ ముందూ, ఇళ్ళల్లోనూ లైట్లు వెలుగుతున్నాయి అప్పటికే- ఆటోలోంచి అరవై ఏళ్ళు పైబడిన వ్యక్తి కిందికి దిగి, చేతిలోకి సంచీ తీసుకుని, డ్రైవర్‌కు బాడుగ చెల్లించాడు. వెంటనే ఆటో వికటాట్టహాసం చేస్తూ, బర్రున వెనక్కు తిరిగి బడబడా వెళ్ళిపోయింది.

ఆ వ్యక్తి కాంపౌండ్ గేటు తెరచుకొని లోపలకు అడుగుపెట్టాడు. ఆ కాంపౌండ్‌లో తలుపు ముందు చిన్న దీపం వెలుగుతోంది. ఆయన తలుపు ముందు నిల్చుని కాలింగ్ బెల్ నొక్కాడు. అప్పటికే లోపలకూడా లైట్లు వెలుగుతున్నాయి. ఒక్క నిమిషం ఆగి మళ్ళీ బెల్ నొక్కాడతను- మరుక్షణంలో లోపల్నుంచి వచ్చినావిడ, తలుపు తెరిచి "మీరా బాబాయ్ రండి... రండి..." అంటూ ఆహ్వానించింది.

అతడు లోపలకు అడుగుబెట్టగానే, ఆమె అతని చేతుల్లోని బ్యాగ్ అందుకొని " ఎక్కడినుంచి బాబాయ్ - తిరుపతి నుండేనా" అనడిగింది. - ఈ సమయంలో ఆయన ఇక్కడికి వచ్చినాడంటే తిరుపతి నుండే బస్సుదిగి వచ్చి వుంటాడని ఆమెకు అనుభవమే- ఇలా రావటం ఇది మొదటిసారి కాదుగా! "అవునమ్మా..." అన్నాడతను, ఆమె వెనకాలే లోపలకు నడుస్తూ.

"శ్యామలా, పిల్లలూ అంతా బావున్నారా" అని పరామర్శించిందామె. శ్యామల ఆయన కూతురు - అల్లుడు ఉద్యోగ రీత్యా తిరుపతిలో వుంటు న్నాడు. నాలుగైదు నెలలకోసారైనా ఈయన కూతుర్ని చూడటానికి తిరుపతి వెళ్ళి వస్తూంటాడు. తిరుగు ప్రయాణంలో తప్పనిసరిగా ఈ ఇంటికి వచ్చి, అందర్నీ పలకరించి, ఇంట్లో మధ్యాహ్నం దాకా వుండి తన పల్లెకు తిరిగి వెళ్తాడు. ఆరు నెలల తర్వాత మళ్ళీ ఇదే రావటం.

ఈ ఇంటి ఇల్లాలు పేరు రాజ్యలక్ష్మి - ఈ వచ్చినాయనా, ఆమె నాన్నా, స్వయాన అన్న దమ్ములు... రాజ్యలక్ష్మి అంటే చాలా అభిమానం ఆయనకు... వాళ్ళ కుటుంబాలు సమిష్టిగా వున్న రోజుల్లో పుట్టిన ఆమెను ఎంతో ప్రేమగా పెంచి ముద్దు చేసిన వాడాయన. కుటుంబాలు వేరయి నప్పటికీ ప్రేమాభిమానాలూ, రాకపోకలూ ఇప్పటికీ ఆర్ద్రంగానే ఉన్నాయి. రాజ్యలక్ష్మి పనీపాటా బాగా తెలిసిన ఇల్లాలనీ, బంధుప్రీతి కలదనీ, ప్రేమతో ఆదరించే స్వభావం కలదనీ చాలా ఆప్యాయత ఆయనకు. ఆమె భర్త వెంకటేశ్వర్లు మునిసిపాలిటీ హైస్కూల్లో ఒక చిన్న బడిపంతులు. ముప్ఫయి ఏళ్ళుగా ఉద్యోగం చేస్తున్నా బాడుగ ఇంట్లోనే బతుకు వెళ్ళదీస్తున్న వాడు - ముగ్గురు పిల్లలు వాళ్ళకు - పెద్దవాడు ఎమ్మెస్సీ ఫైనల్ - పెద్దమ్మాయి బి. ఎ. రెండో సంవత్సరం; చిన్నమ్మాయి ఇంటర్ మొదటి సంవత్సరం - వాళ్ళ చదువులూ, ఖర్చులూ, వీటితో చాలా పొందికగా జాగ్రత్తగా ఇల్లు గడుపుతుంది ఆ ఇల్లాలు - అందుకే ఆమె అంటే చాలా మెచ్చు ఆయనకు.

బట్టలు మార్చుకుని హాల్లో కూర్చున్నాడతను. ఈలోగా పాలవాడు పాలుపోసి వెళ్తే "కాఫీ తయారు చేస్తాను. మీరు ముఖం కడుక్కోండి" అందామె. వచ్చి పదినిమిషాలయినా ఇంట్లో ఎవరూ కనిపించలేదాయనకు. అలికిడీ వినిపించలేదు. హాల్లో వేసిన మంచాల మీద పరుపులున్నాయి గాని మనుషుల్లేరు. ఈ వెంకటేశ్వర్లూ, పిల్లలూ కన్పించరేమిటి? కన్పించకుండా ఏ గదుల్లోనో ఉంటారనుకోటానికి ఇదేం ఇంద్రభవనమా? ఉన్నవి మూడంటే మూడే గదులు-

బాత్ రూమ్‌కెళ్ళి ముఖం కడుక్కొని వచ్చాడాయన. ఈలోగా ఆమె కాఫీ తయారుచేసి, ఒక పొడవాటి గ్లాసు నిండా తెచ్చి ఆయనకందించింది. ఆయన ఏదో అడగబోతుండగా "మోటార్‌వేసి వచ్చాను. నీళ్ళు నిండాయేమో చూసి వస్తాను" అంటూ లోపలకు వెళ్ళిందామె.

కాఫీ తాగి, గ్లాసు టీపాయ్ మీద పెట్టాడాయన- ఈలోగా మోటర్ ఆపుచేసి వచ్చిందామె. ''బయట వసారాలో కూచో బాబాయ్ - మంచాలూ, పరుపులూ సర్ది, హాలంతా శుభ్రం చేస్తాను... పేపరు వచ్చింది. చూస్తూండండి" అందామె.

"అది సరేమ్మా, ఇంతకూ వెంకటేశ్వర్లూ, పిల్లలూ ఎక్కడ? వచ్చినప్పట్నుంచీ చూస్తున్నాను - ఎక్కడా కన్పించరే" అన్నాడు, ఆశ్చర్యపూర్వకమైన ధ్వనితో

"వాళ్ళా బాబాయ్! వాళ్ళంతా ఇప్పుడు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఉంటారు" అంది పరుపులు చుట్టవేస్తూ

''పోలీస్ గ్రౌండ్స్‌లోనా? అక్కడేం పని?"అన్నాడు మరింత విస్తుపోతూ ఆయన.

"పనా? పాటా? అదేదో మార్నింగ్ వాక్ అట! జాగింగ్ అట! తెల్లవారుజామున ఐదున్నరకు లేచి, ఇంట్లో అందరూ ఒకటే పరుగు - ఆర్నెల్లయింది ఈ నిర్వాకం మొదలుపెట్టి" అందామె సాగదీస్తూ-

''మళ్ళీ ఎప్పుడొస్తారు వీళ్ళు'' అబ్బుర పడిపోతూ అడిగాడాయన-

"ఐదున్నరకు బయల్దేరి వెళ్ళారా! వచ్చేసరికి ఏడు దాటుతుంది-'' అందామె మంచాలు మడతపెడుతూ.

''అవునా! తెల్లవారుజాము అంటే సరస్వతీజాము కదా! చదువుకోకుండా ఈ పరుగులేమిటి?'' పెదవులు చప్పరిస్తూ అన్నాడాయన.

"ఆరోగ్యం కోసమట. పొట్టలు పడకుండా, బరువు పెరగకుండా, స్లిమ్‌గా వుండటానికట బాబాయ్" అంది ఆమె హాల్లో కసవు వూడ్చేందుకు పరక చేతబట్టుకొని.

ఆయన బయట వసారాలో కూచొని పేపరు తీసుకొన్నాడు.

రాజ్యలక్ష్మి కసువులు వూడ్చి, హాలంతా నీళ్ళు చిలకరించి, నడుం వంచి, బట్టతో శుభ్రం చేస్తూంది. నలభై ఐదేళ్ళ వయసిప్పుడామెకు. ముగ్గురు ఎదిగిన బిడ్డలుండీ, ఇంటి పనంతా నెత్తికెత్తుకొని చేయటం చూస్తుంటే జాలేసిందాయనకు.

వంటింట్లో పాత్రలన్నీ పెరట్లోకి తీసుకెళ్ళి, వాటిని తోమే పనిలో ఆమె వుండిపోతే, దిన పత్రికను తిరగవేస్తూండిపోయాడాయన.

ఇంట్లో అందరూ కట్టగట్టుకొని జాగింగ్ చేయటానికి వెళ్ళినారనగానే అంతా అర్థమైపోయిందాయనకు - పల్లెటూళ్ళో వుంటున్నప్పటికీ, మారుతున్న కాలాన్ని గమనించే నేర్పుందాయనకు - ఈ పరుగులూ, మార్నింగ్ వాక్‌లూ, జాగింగ్‌లూ పట్టణాల్లో కూడా ఐదారేళ్ళ క్రితం వరకూ లేదు. ఈ మధ్య వచ్చి పడిందిది - ఇంట్లో పనులన్నీ ఇల్లాళ్ళ నెత్తిమీద వేసి రోడ్లు పట్టుకొని పరుగులు తీయటం పట్ల చాలా విచారం వేసిందాయనకు. ఉన్నపళంగా ఎందుకో ఈ మధ్య కాలంలో ఆరోగ్య రోగం పట్టుకుంది పట్టణాలలో ఉన్నవాళ్ళకు- తోమిన గిన్నెలను వంటింట్లో రాజ్యలక్ష్మి సర్దుతున్న శబ్దం ఆయనకు వినిపిస్తూనే వుంది. పొద్దున లేచినప్పట్నుంచీ ఎంతపని ఇల్లాలికి? రాత్రి పడుకొనే దాకా ఎన్నెన్ని పనులు? కసువులు వూడ్చటం, ఇల్లు కడగటం, అంట్లు తోమటం, బట్టలుతకటం, కాఫీలు, టిఫిన్లూ, అన్నాలూ, కూరలూ ఎంతపని? ఎంతెంతపని? ఈ శ్రమ ముందు ఏ జాగింగ్‌లు, ఏ వాకింగ్‌లు,

ఏ రన్నింగ్‌లు పనికివస్తాయి? ఈ శ్రమ చేయని సోమరులకేగదా ఈ వాకింగ్‌లూ! ఈ శ్రమలో భాగం పంచుకోని వాళ్ళకేగదా ఈ జాగింగ్‌లూ, రన్నింగ్‌లూ- ఆలోచిస్తూ కూచున్న ఆయనకు, అలికిడులు వినిపించి చూస్తే, వెంకటేశ్వర్లూ, పిల్లలూ, భళ్ళున వూడిపడ్డారు ఎట్టెదుట.

"ఎప్పుడొచ్చినావు తాతా" అంటూ పిల్లలూ "మామా"అంటూ వెంకటేశ్వర్లూ పలకరించారాయనను.


అందరూ జాగింగ్ డ్రెస్‌లో వున్నారు. అందరి ముఖాల మీదా, చేతుల మీదా, చమట స్రవిస్తూ వుంది. అందరూ బాగా అలసిపోయనట్టు వారి మాటల తీరులోనే కన్పిస్తూ వుంది. ఉసూరుమంటూ నలుగురూ కుర్చీల్లో కూలబడిపోయారు. - వెంటనే బూట్లు విప్పేసుకునే ఓపిక కూడా కన్పించలేదు వాళ్ళలో.

లోపల రాజ్యలక్ష్మి టిఫిన్ తయారుచేసే పనిలో ఉండిపోయింది. తిరుగమోత వాసనలు బయటికి గుబాళిస్తున్నాయి.

"ఏం టిఫిన్ మమ్మీ" బయటి నుంచే గట్టిగా కేకేసింది చిన్నమ్మాయి. ఆ మాటకు విసురుగా బయటికి వచ్చింది రాజ్యలక్ష్మి.

"దమ్మిడీ పనిచెయ్యరుకాని లేచినప్పట్నుంచీ తిండి చింతే వీళ్ళకు బాబాయ్! ముందు స్నానాలు చేయండి! ఎలా కూచున్నారో చూడండి, కాళ్ళు బారచాపుకొని, పెద్దవాళ్ళున్నారన్న జ్ఞానమైనా లేకుండా", అంటూ నరనరా లోపలకు వెళ్ళిందామె.

"ఇదంతా మాకు రోజూ వుండే గొడవేలే తాతా! మమ్మీ అలా అంటుందేగాని, అరగంట తిండికి ఆలస్యమైతే అల్లాడిపోతుంది" అంది పెద్దమ్మాయి.



ముసిముసి నవ్వులు నవ్వుతూ కూచున్నాడు రాజ్యలక్ష్మి భర్త వెంకటేశ్వర్లు.

ఇంట్లో అందరూ స్నానాలు, టిఫిన్లూ ముగించేసరికి తొమ్మిది గంటలు దాటింది. ఆరోజు ఆదివారం కావటం వల్ల అందరూ విరామంగా టీవీ ముందు కూలబడినారు. రాజ్యలక్ష్మి మాత్రం ఇంకా వంటింట్లోనే, తిన్న తట్టలూ, పాత్రలూ శుభ్రం చేసే పనిలో ఉండిపోయింది.

ఇదంతా గమనిస్తున్న బాబాయ్ ఇక వూరికే వుండలేక పోయాడు... "ఏమిటమ్మా! మీ అమ్మకు ఇంటిపనిలో కొంతైనా సాయపడకుండా, ఇలా అతిథుల్లా కూర్చోవటం ఏమైనా బావుందా" అన్నాడు మందలింపు స్వరంతో

''మేమేం చేయలేం తాతా! ఈరోజు సెలవుకదా అని, మరో రెండు రౌండ్లు జాగింగ్ చేసేసరికి కాళ్ళూ, నడుమూ గుంజేస్తున్నాయి - మా మమ్మీకి ఎంతచేసినా పని తెమలదు - ఏదో ఒకటి ఎప్పుడూ చేస్తూనే ఉంటుంది'' అంది చిన్నమ్మాయి.

"మీ లాంటి పిల్లలు వుంటే అంతేకదమ్మా! - పని చెయ్యని వాళ్ళకు పనిచేసే వాళ్ళు ఎప్పుడూ అలుసుగానే కన్పిస్తారు - ఇంతకూ మీరంతా ఆ జాగింగ్‌లు చేయటమెందుకూ! అలసిపోవట మెందుకూ!" అనడిగాడు బాబాయ్!

ఆ నలుగురూ ఒకరిమొహాలు ఒకరు చూసుకొని, బాబాయ్‌ను చూసి జాలిగా నవ్వు కున్నారు - ఓస్! ఈ మాత్రం తెలీదా అన్న భావాన్ని చూపుల్తో చిలికిస్తూ, "తాతయ్యా! మీరింకా ఎక్కడో పాతకాలంలో ఉన్నారు - 'మార్నింగ్ వాక్' ఐ మీన్ 'జాగింగ్' ఎందుకు చేస్తారో కూడా తెలీకపోతే ఎలా, ఎంత పాతకాలం వాళ్ళయితే మాత్రం! జాగింగ్ చేయటం వల్ల, శరీరలోని అన్ని భాగాలూ కదులుతాయి. రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది. శక్తీ, చురుకుదనం లభిస్తుంది. బరువు పెరగకుండా, పొట్ట రాకుండా, స్లిమ్‌గా ఉండొచ్చు - ఏ రోగాలూ మనందరికి రావు. ఆరోగ్యంగా కలకాలం జీవించవచ్చు..." అన్నాడు ఎమ్మెస్సీ ఫైనల్ చదువుతున్న రాజ్యలక్ష్మి కొడుకు- అలా జాగింగ్ ఉపయోగాలు చెప్పే అవకాశం లభించినందుకు ఆనందంతో మురిసిపోతున్నాడు ఆ కుర్రాడు.

"అలాగా నాయనా! శరీరంలో అన్ని భాగాలూ, కాళ్ళూ, చేతులూ, నడుమూ పొట్టా, ఇవన్నీ చక్కగా కదలటానికేనన్న మాట మీరు జాగింగ్ చేయటం" అన్న ప్రశ్నను సంధించినట్టుగా అడిగాడు బాబాయ్.

''యా...'' అన్నారు ముగ్గురు పిల్లలూ ముక్తకంఠంతో-

"జాగింగ్ చేస్తే మీరు బరువు పెరక్కుండా, స్లిమ్‌గా వుంటారన్నమాట" అని దీర్ఘం తీస్తూ అడిగాడాయన. అంతటితో ఆగకుండా, " ఎక్కడో బజార్లు పట్టుకొని, గ్రౌండ్లు పట్టుకొని మీరు పరుగులు తీస్తున్నది అందుకోసమేనన్నమాట-" అంటూ స్వరంలో జాలిని కురిపించాడాయన.

" ఔనండీ తాతగారూ! అవును..." అన్నారు పిల్లలు కాస్త చిరాకుగా, ఈ ముసలాయనేమిటి ఇలా పట్టుకున్నాడు అనుకుంటూ-


"చిట్టి తల్లుల్లారా! నాయనల్లారా! నేనో రహస్యం చెబుతాను వినండి" అంటూ క్షణంసేపు ఆగాడాయన.

''ఏమిటబ్బా, ఈ ముసలాయన చెప్పే రహస్యం'' అనుకుంటూ ఆసక్తిగా తలలు ముందుకు చాచినారు వాళ్ళు-

"మీరు ఇంట్లోనే వుండి నేను చెప్పిన పనులు రోజూ చేయండి! ప్రొద్దున్నే నడుం వంచి ఇంట్లో, బయటా మొదట కసువులు వూడ్చండి- నీళ్ళు చల్లి గదులన్నీ కడిగి శుభ్రం చేయండి! అంట్లు తోమండి- బట్టలు ఉతకండి- నీళ్ళు మోయండి- ఒక్కొక్కరు ఈ పనులన్నీ రోజూ ఒక గంట చేయండి చాలు- మీ కాళ్ళూ, చేతులూ, నడుమూ, పొట్టా, ఎలా కదులుతాయో, ఎంతెంత చమట పడుతుందో చూడండి.." అంటూ ఉపన్యాసం ప్రారంభించేసరికి, అంతా సరదాగా వింటున్నారు. రాజ్యలక్ష్మి గడప దగ్గరకు వచ్చి "అలా గడ్డిపెట్టండి బాబాయ్! ఇంట్లో నలుగురున్నారు - చిన్న పని కూడా ఇంట్లో చెయ్యరు. కనీసం స్నానానికి వెళ్ళేటప్పుడు తువ్వాలు కూడా తీసుకెళ్ళరు. మీరు చెప్పిన పనుల్లో సగం చేసినా, ఈ వయసులో నాకూ శ్రమ తగ్గుతుంది! వీళ్ళకు ఈ పరుగులూ, గిరుగులూ ఉండవు" అంది చిరుకోపం పిల్లలమీద ప్రదర్శిస్తూ...

"మీ మాట ఒప్పుకుందాం తాతగారూ! మరి ఈ టౌన్లో ఇన్ని వందల మంది, ఈ రహస్యం తెలీకే జాగింగ్ చేస్తున్నారంటారా!" అంటూ 'లా' పాయింట్ తీశాననుకుంటూ మురిసిపోతూ అడిగింది చిన్నమ్మాయి.

"రహస్యం తెలియక కాదు తల్లీ! శ్రమ సంస్కృతి పట్ల గౌరవం లేకపోవటం, ఇంటిపనుల పట్ల తేలిక భావం వుండటం ఇందుకు కారణం!" అంటూ ఆయన అందరి ముఖాల్లోకి చూశాడు. తాను చెబుతున్నది వింటున్నారా లేదా అన్న



తోడేంత పని వుంది. ఇంటి పనినంతా గృహిణిమీద వేసే సంప్రదాయం నుంచి మనం బయటపడాలి. ఇంట్లో ఎవరి పనులు వారు చేసుకుంటూ గృహలక్ష్మికి సహాయపడండి - అందరూ ఆరోగ్యంగా వుండండి" అని ఆయన చెబుతూంటే

భావంతో-

"చెప్పండి మామా" అనడిగాడు వెంకటేశ్వర్లు ఏదో కొత్తదనం ఆ ముసలాయన మాటల్లో కనిపించి-

"మనకంటే సంపన్న వర్గాలను చూసి, మనకంటే తీరిక వర్గాలను చూసి, మన మధ్య తరగతి వర్గం తెచ్చుకుంటున్న జాడ్యం నాయనా ఇది! మనకంటే పై వర్గాలకు అన్ని పనులు చేసిపెట్టటానికి, నౌకర్లూ పనిమనుషులూ వుంటారు - వాళ్ళు చేయటానికి ఇక ఏ పనులూ వుండవు - అందుకే వాళ్ళు బరువు పెరగటాలూ, పొట్ట పెరగటాలూ నిరోధించు కోవటానికి, ఈ కృత్రిమ వ్యాయామాలూ, వాకింగులూ, రన్నింగులూ చేస్తారు. మనకెవరున్నారు చేసి పెట్టటానికి? మనకు ఇంటినిండా, అందరికీ

రాజ్యలక్ష్మి మెరిసే కళ్ళతో ఆయనవైపు చూస్తూ వుంది-

"దేశంలో ఇన్ని పల్లెలున్నాయి. ఏ పల్లెలో అయినా ఈ వాకింగులూ, జాగింగులూ మీరు చూశారా! ఎందుకు లేవు? వాళ్ళకు వాళ్ళ పనులే వ్యాయామం! మీ అమ్మను చూడండి ఇప్పటికీ ఎంత ఆరోగ్యంగా, మీ భాషలో 'స్లిమ్'గా వుందో చూడండి! ఇంతకూ కారణం శ్రమ, తల్లుల్లా రా! మన పనులు మనం చేసుకోవటంలో ఒక సంస్కృతి వుంది. ఒక గౌరవం వుంది!" అంటూ ఆ ముసలాయన ఆర్ద్రంగా చెబుతూంటే వెంకటేశ్వర్లూ, పిల్లలూ, 'మనం ఎక్కడ తప్పు చేశామా' అని ఆలోచిస్తూ, వింటూండిపోయారు.

★